క్లుప్తంగా

నేడు మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలోని మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు బుధవారం తెలిపారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి, సాయంత్రం విశేషపూజలు ఉంటాయని తెలిపారు.

ధూప, దీప నైవేద్యానికి విరాళం

బనగానపల్లె: మండలంలోని పలుకూరులో వెలసిన శ్రీవీరభద్రస్వామివారికి ధూపదీప నైవేద్యానికి ఇదే గ్రామానికి చెందిన జిల్లెల్ల నాగేశ్వరరెడ్డి రూ.5వేలు విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆలయ అర్చకులు భాస్కరయ్యకు దాత నగదు అందజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న బోరెడ్డి నరసింహారెడ్డి

బేతంచెర్ల: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నవ్యాంధ్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెడ్డి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని రీడ్ జూనియర్ కళాశాలలో నవ్యాంధ్ర స్టూడెంట్ ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేష్, రాజేష్ ఎంపికయ్యారు.

బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా వడ్డే మహరాజ్



డోన్ టౌన్: స్థానిక రోటరీ క్లబ్ భవనంలో బుధవారం బీజేపీ జిల్లా కో ఆర్డినేటర్ మధు ఆధ్వర్యంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. బీజేపీ డోన్ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా వడ్డే మహరాజ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. వడ్డే మహరాజ్ సామాన్య కార్యకర్త నుంచి ప్యాపిలి మండల అధ్యక్షుడిగా, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం కార్యదర్శిగా పని చేస్తూ జిల్లా కో ఆర్డినేటర్ పదవిని కైవసం చేసుకున్నారని అభినందించారు.

చిన్నారులను బడిలో చేర్పించాలి


విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈఓ

ప్యాపిలి: బడిఈడు చిన్నారులను బడిలో చేరిప్పించాలని ఎంఈఓ వెంకటేశ్ నాయక్ సూచించారు. మండల పరిధిలోని వెంగళాంపల్లిలో బుధవారం 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ చిన్నపిల్లలను బడికి పంపాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పేదల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బడికి వచ్చే పిల్లలకు పుస్తకాలు ఉచితంగా ఇవ్వడంతో పాటు పాఠశాలలోనే మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించిందని తెలిపారు. అనంతరం ఆయన వెంగళాంపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

డోన్ రూరల్ : బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ పారిశుద్ధ్య కార్యాలయ సిబ్బంది ఆరుగురు విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించారని, బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం అవకాశం కల్పించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, మున్సిపల్ యూనియన్ నాయకులు హరిచంద్ర, విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగించాలి

నంద్యాల(న్యూటౌన్): గ్రూప్–2 మెయిన్స్ పరీక్షకు గడువు పొడిగించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న కోరారు. బుధవారం మధుశేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. గ్రూప్–2 మెయిన్స్ పరీక్షను జూలై 28 నుంచి నిర్వహిస్తామని ప్రకటించారన్నారు. ఎన్నికలు జరిగిన దృష్ట్యా అభ్యర్థులు సిలబస్ ప్రిపరేషన్‌లో ఇబ్బందులు పడ్డారని, మరో రెండు నెలలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు.

అంకితభావంతో అభివృద్ధి చేశాం

- డోన్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాం
- ప్రతికుటుంబానికి సంక్షేమ ఫలాలు అందజేశాం
- మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి


కేవీఎస్ పార్కులో వాకర్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డోన్ నియోజకర్గాన్ని అంకితభావంతో అభివృద్ధి చేశామని, డోన్ పట్టణాన్ని రూ. కోట్లు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దామని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కేవీఎస్ పార్కులో మార్నింగ్ వాక్ సందర్భంగా బుగ్గన వాకర్లతో మాట్లాడారు. రూ.3కోట్లతో 7 పార్కులను ఏర్పాటు చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లలకు ఆట వస్తువులు, యోగా, స్విమ్మింగ్ సెంటర్లు, ఇన్నర్‌వీల్‌క్లబ్ భవనం నిర్మించిన విషయాన్ని బుగ్గన గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నా ప్రత్యేక చొరవతోనే జరిగిందనే విషయం ఎవ్వరూ కాదనలేని సత్యమని, అయితే ఊహించని ఫలితాలు చూడాల్సి వచ్చిందని మాజీ మంత్రి అభిప్రాయపడ్డారు. క్రీడల ప్రోత్సాహానికి కూడా పట్టణంలో షటిల్, టెన్నిస్ కోర్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.4కోట్లతో ప్రధాన రోడ్లను వెడల్పు చేయడమేకాక సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటును ప్రతిఒక్కరూ అభినందించారన్నారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం క్లబ్ హౌస్, ఆధునిక కూరగాయల మార్కెట్, టీటీడీ కల్యాణ మండపం తదితర అభివృద్ధి పనులు ఎన్నో చేశామని ఈ సందర్భంగా వాకర్లకు గుర్తు చేశారు. మాజీ మంత్రి బుగ్గన వెంట మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, న్యాయవాది నాగభూషణంరెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్ తదితరులు ఉన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడి

ప్యాపిలి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమిపై నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని... అండగా ఉంటామని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ శ్రేణులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారని, ఊహించని ఫలితాలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాయన్నారు. నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని , ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గెలుపోటములు సాధారణమని, అయితే ఫలితాల నుంచి త్వరగా తేరుకుని ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఇప్పటి నుంచే ప్రజల పక్షాన ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. భవిష్యత్తులో తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలో తెచ్చేందుకు..నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, బాలయ్య, కమతం భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రాజా మురళి, బోరెడ్డి రాము, శ్రీనివాసరెడ్డి, పర్వతం సోదరులు రామసుబ్బయ్య, నేరేడుచెర్ల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రమ శిక్షణతో మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్ : ఖైదీలు క్రమ శిక్షణ, సత్‌ప్రవర్తనతో మెలగాలని మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. స్థానిక సబ్ జైలును బుధవారం జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో జడ్జి సమావేశమయ్యారు. సబ్ జైలులో భోజన వసతి సదుపాయాలపై ఖైదీలతో మాట్లాడి తెలుసుకున్నారు. అదే విధంగా ఖైదీల వివరాలు . ఏఏ నేరాల కింద శిక్షలు అనుభవిస్తున్నారు తదితర అంశాలపై ఆరా తీశారు. బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారా... లేదా అని అడిగి తెలుసుకున్నారు. స్వతహాగా బెయిల్ కోసం న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వం తరుపున ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని జడ్జి తెలిపారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరిడెంట్ రఘునాథరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


చిన్నారులతో ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు

డోన్ : మండలంలోని వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు ఘనంగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి గ్రాడ్యుయేషన్ డే ప్రాధాన్యతను వివరించారు. ఎనిమిది మంది విద్యార్థులను ఒకటవ తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తిమ్మమ్మ, రాధమ్మ, కార్యకర్తలు రాజేశ్వరి, ఉషారాణి, విజయలక్ష్మి, నాగశ్రీనివాసదేవి, వెంకటేశ్వరమ్మలు పాల్గొన్నారు.

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తకోట అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య ప్రాముఖ్యతను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం పిల్లలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహానికి సాయం



నిత్యావసర సరుకులను అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ చెందిన ఓ నిరుపేద కుటుంబంలో జరుగుతున్న అమ్మాయి వివాహానికి బేతంచెర్ల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ సాయం చేసింది. బేతంచెర్ల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు మహబూబ్‌వలి, ఉపాధ్యక్షుడు షేక్‌షావలి, సభ్యులు పెళ్లికి సంబంధించిన నిత్యావసర సరుకులను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సుబ్బరాయుడు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్ అండ్‌బీ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. బనగానపల్లె పట్టణానికి చెందిన శంకరమ్మ, సుబ్బరాయుడు కుటుంబాలు వంటసామగ్రి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉదయం ఆటోలో జమ్మలమడుగువైపు వెళ్తుండగా మండలంలోని గుళ్లదూర్తి– అల్లూరు గ్రామాల మధ్య సుబ్బరాయుడు మూత్ర విసర్జనకు ఆటో దిగాడు. మిగిలిన వారు ఆటో పక్కన నిలిచి ఉన్నారు. కోవెలకుంట్ల వైపు నుంచి టాటాఏసీ ఆటో వేగంగా వెళ్తూ వారిపై దూసుకెళ్లింది. ప్రమాదంలో సుబ్బరాయుడికి రెండుకాళ్లు విరగ్గా, శంకరమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాలకు తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

తండ్రి, కుమారుడికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. శిరువెళ్లకు చెందిన బాలస్వామి, ఆయన కుమారుడు అఖిల్ పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెయింటింగ్ పని నిమిత్తం కోవెలకుంట్లకు వచ్చిన వారు పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వెళ్తున్నారు. నంద్యాల వైపు నుంచి జమ్మలమడుగు వైపు వెళ్తుతున్న స్కార్పియో వాహనం మండలంలోని జోళదరాశి గ్రామ సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. బాలస్వామికి కాలు నుజ్జుకాగా అఖిల్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులకు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాలకు తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలి

- మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు
- ఘనంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం


కోవెలకుంట్ల: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: యువత సమాజానికి ఆదర్శంగా ఉండి ఆయా రంగాల్లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోవెలకుంట్ల పోలీస్‌సర్కిల్ సీఐ జయచంద్ర, సెబ్ సీఐ వర్ధనాదేవి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కోవెలకుంట్ల పట్టణంలో ప్రభుత్వ, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ సర్కిల్ నుంచి ముదిగేడు చౌరస్తా, సంతమార్కెట్, అంకాలమ్మ టర్నింగ్ మీదుగా జమ్మలమడుగు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఇటీవల కాలంలో మాదక ద్రవ్యాలను చాక్లెట్, బిస్కెట్‌లలో కలిపి అమ్ముతున్నారని, వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. చెడు వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. మాదక ద్రవ్యాల విక్రయానికి సంబంధించి సమాచారం తెలిస్తే వెంటనే 14500 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వరప్రసాద్, రాజ్‌కుమార్, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, కృష్ణదాసు, నాగేశ్వరరెడ్డి, నరేంద్రనాథరెడ్డి, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, క్రిష్ణశశాంక, రాజు, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

బనగానపల్లె రూరల్ : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు,సెబ్ సీఐ జోగేంద్రలు పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా పట్టణంలో కళాశాలల విద్యార్థిని,విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దని,వాటిని అలవాటు చేసుకుంటే జీవితాలు నాశనం అవుతాయన్నారు. మాదకద్రవ్యాల వినియోగం చట్టపరంగా నేరమని, వాటిని విక్రయించినా, వినియోగించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మాదక ద్రవ్యాలు.. జీవితానికి ముప్పు

డోన్ టౌన్ : మాదక ద్రవ్యాలు జీవితానికే ముప్పు అని, వాటి జోలికి వెళ్ళవద్దని అని రూరల్ సీఐ అస్రత్‌బాషా సూచించారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కళాశాల విద్యార్థులతో పట్టణంలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కొత్తబస్టాండ్ నుంచి పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి మానవ హారంగా ఏర్పడి మత్తు పదార్థాల వలన కలిగే అరిష్టాలను తెలియజేశారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైనవారు నిండు జీవితాన్ని జైలుపాలు చేసుకుంటున్నారని, లేదా ఆత్మ హత్యలతో తల్లిదండ్రులకు శోకం మిగిలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వినియోగం, విక్రయం గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తోటి విద్యార్థులు, సహచరులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండ వారిని జాగృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి, సిబ్బంది, శ్రీసుధ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ యోగానందరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతున్న సెబ్ సీఐ వర్ధనాదేవి


బనగానపల్లె: విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ గంటాసుబ్బారావు, సెబ్ సీఐ జోగేంద్ర


డోన్ : పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ అస్రత్‌బాషా

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి


మాట్లాడుతున్న డాక్టర్ గోకారి

సంజామల: అతిసార వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రతలు పాటించాలని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ గోకారి సూచించారు. ఈ మేరకు బుధవారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ మండల కేంద్రం సంజామల ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బస్టాండ్ వరకు వైద్యసిబ్బందితో ఆయన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. అదేవిధంగా కలుషితమైన నీరు, ఆహారం తీసుకోకూడదన్నారు. కార్యక్రమంలో హెల్త్‌కేటర్ నారాయణదాసు, ఎంపీహెచ్‌ఈఓ వేంకటేశ్వర్లు, ఆయుష్ ఫార్మాసిస్ట్ ఉమామహేశ్వరి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి

డోన్ : పట్టణాభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో పాటు అధికారులు సహకరించాలని, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కోరారు. మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. పట్టణంలో పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ అధ్వానంగా ఉందని, పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. శివారు ప్రాంతాల అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లతో పాటు కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

డోన్ టౌన్ : ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని, శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం రోడ్లు భవనాలశాఖ అతిథి గృహంలో ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. బేతంచెర్ల రోడ్డులో రైల్వేశాఖ నిర్మిస్తున్న ప్రహరీ వలన కలిగే అసౌకర్యాలపై అధికారులతో చర్చించారు. పట్టణంలోని రైల్వే గేట్ల వద్ద ఏర్పాటు చేస్తున్న అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి వలన ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగం ఉంటుందా అని రైల్వే, ఆర్ అండ్ బీ అధికారులను ప్రశ్నించారు. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం వలన చిన్నపాటి వాహనాలకు మాత్రమే అనుకూలంగా ఉంటుందని,బేతంచెర్ల రోడ్డు వైపు వెళ్లే భారీ వాహనాల పరిస్థితి ఏమిటని అడిగారు. వీటిపై పునరాలోచన చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ సీఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఈలు శ్రీకాంత్ రెడ్డి, మధు, రైల్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్ సీజ్


పాఠశాలను సీజ్ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

డోన్ రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని భాష్యం స్కూల్‌ను బుధవారం డిప్యూటీ డీఈఓ నాయక్, ఎంఈఓ ప్రభాకర్ సీజ్ చేశారు. భాష్యం స్కూల్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్‌లు చేపడుతున్నారని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసనలు చేపట్టిన నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు విచారించిన డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ స్కూల్‌ను సీజ్ చేశారు. స్కూల్ వద్దకు వచ్చిన ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా యూనిఫాంలు, పుస్తకాలు అమ్ముతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు మనోజ్, శశిధర్‌రెడ్డి, రంగస్వామి, అశ్వత్, ధర్మతేజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేయాలి

డోన్ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలను అందించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్ కోరారు. బుధవారం స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో అధికారులకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా ప్రభుత్వ విద్యను భలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు తెరచి పక్షం రోజులైనప్పటికీ 7వ తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ప్రభుత్వం అందించలేని స్థితిలో ఉందన్నారు. ఇప్పటికైనా స్పందించి విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు వెంటనే అందివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రాజేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ చిన్నమద్దమ్మ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కొలుములపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్, ఏఎన్‌ఎం సావిత్రి సూచించారు. వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు.

హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన అవసరం

డోన్ : హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి, ఎయిడ్స్ సంస్థ డైరెక్టర్ అలీహైదర్ పేర్కొన్నారు. హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో బుధవారం స్థానిక ప్రభుత్వ అర్బన్ హెల్త్ సెంటర్‌లో హెచ్ఐవీ బాధితులకు ఏఆర్‌టీ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. రోగులకు సీడీ 4, వై, వైరల్ లోడ్ టెస్టులను ఉచితంగా చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొంతవరకు ప్రజల్లో చైతన్యం వచ్చిందని, కేసుల సంఖ్యకూడా తగ్గాయన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సిబ్బంది రాజ్‌కుమార్, సుధారాణి, సంస్థ సభ్యులు శేషన్న, సీతామహాలక్ష్మి, లలిత, మధుకుమార్, సరస్వతి, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి వివిధ తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. 6, 8 వతరగతుల్లో ఎస్సీ, ఎస్టీ, 7వ తరగతిలో ఎస్సీ కేటగిరిల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు దరఖాస్తుఫారంతోపాటు ఆధార్‌కార్డు, కులధృవీకరణపత్రం, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు జతపరిచి ఈ నెల 28వ తేదీ సాయంత్రంలోపు పాఠశాలలో అందజేయాలన్నారు. 29వ తేదీన ఉదయం 10 గంటలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ముందుతరగతి సిలబస్ ప్రకారం ఆబ్జెక్టివ్ విధానంలో 50 మార్కులకు పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణ సబ్ స్టేషన్ పరిధిలోని టౌన్ టూ ఫీడర్ కింద అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త బస్టాండ్ వెనకాల, శ్రీనివాసనగర్, ఆటో నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.